# ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

గురువారం 30, ఏప్రిల్ 2026




## మహిళలు, చిన్నపిల్లలు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

*** కాగజ్‌నగర్ డీఎస్పీ వహిదుద్దీన్**

కాగజ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త



మహిళలు, చిన్నపిల్లల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని డీఎస్పీ వహిదుద్దీన్ అన్నారు. బుధవారం ప్రజా పాలన-ప్రగతి పాలన కార్యక్రమంలో భాగంగా, కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నీతిక పంత్ ఆదేశాల మేరకు కాగజ్‌నగర్ పట్టణంలోని పాలిటెక్నిక్ ఫ్రీ కోచింగ్ సెంటర్‌లో డీఎస్పీ వహిదుద్దీన్ ఆధ్వర్యంలో షీ టీమ్ ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, చిన్నపిల్లల భద్రతపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. కొత్త చట్టాలు అయిన బి.ఎన్.ఎస్ గురించి విద్యార్థులకు వివరించి, మహిళల భద్రత, చిన్నపిల్లల రక్షణ, లింగ సమానత్వం, సైబర్ నేరాలు, బాల్య వివాహాల నివారణ వంటి అంశాలపై సమగ్రంగా వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పోలీసు సహాయం పొందేందుకు డయల్ 100, 112 సేవలతో పాటు 1930 సైబర్ మోసాల హెల్ప్‌లైన్, 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్లను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ టౌన్ ఎస్‌హెచ్ఓ కె. ప్రేమ్ కుమార్, ఎస్ఐ కె. రాజు, ఎంఈవో ప్రభాకర్, షీ టీమ్ ఇన్‌చార్జి డి. సునీత, సిబ్బంది రమాదేవి, శ్రీనివాస్, సునీత తదితరులు పాల్గొన్నారు.

### మ్యాపింగ్ ప్రక్రియ

## పకడ్బందీగా చేపట్టాలి

**● స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్, పరిశీలకులు ఆర్.దశరథ్**



నస్పూర్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త

ప్రత్యేక సమగ్ర ఓటర్ల జబితా సవరణలో మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్, మంచిర్యాల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పరిశీలకులు ఆర్.దశరథ్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, ప్రత్యేక ఉప పాలనాధికారి చంద్రకళ లతో కలిసి అన్ని మండలాల తహసిల్దార్లు, ఎన్నికల విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్, పరిశీలకులు మాట్లాడుతూ ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో మ్యాపింగ్ శాతాన్ని పెంపొందించడం అత్యవసరమని మిగతా 2లో..

## అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు

*** రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద**

మంచిర్యాల బ్యూరో, ఏప్రిల్ 29, ప్రభాతవార్త



నిరుపేదలకు ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన ప్రతి ఒక్కరికి కేటాయించడం జరుగుతుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. బుధవారం జిల్లాలోని చెన్నూర్ మండలం బావురావుపేట గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ అర్హత కలిగి ఇందిరమ్మ ఇండ్లు రానివారు ఆందోళన చెందవలసిన అవసరం లేదని, అర్హులైన ప్రతి ఒక్కరికి అందించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. 100 ఇందిరమ్మ ఇండ్లు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని, మిగిలిన ఇండ్లు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. రహదారుల విస్తరణలో భాగంగా బావురావుపేట గ్రామం నుండి కత్తెరసాల వరకు 5 కోట్ల రూపాయలు, బావురావుపేట నుండి కాచనపల్లి వరకు 3 కోట్ల రూపాయలతో పనులు చేపట్టడం జరిగిందని, త్వరగా పూర్తిచేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. చెన్నూరు నియోజకవర్గ పరిధిలో రహదారులు, మురుగు కాలువల అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు ప్రజలకు నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపడుతున్నామని తెలిపారు. భూ నిర్వాసితులకు 26 కోట్ల రూపాయల నష్టపరిహారం మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. బోర్‌వెల్‌ల ఏర్పాటు ద్వారా నీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని, చెన్నూర్ నియోజకవర్గ పరిధిలో 300 బోర్‌వెల్స్ ఏర్పాటు మిగతా 2లో..

### అధిక పంట దిగుబడి సాధించేందుకు

## రైతులు మెలకువలు పాటించాలి

**✪ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

నస్పూర్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త



జిల్లాలో వ్యవసాయ సాగులో అధిక పంట దిగుబడి సాధించేందుకు రైతులు మెలకువలు పాటించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సన్నరకం వడ్ల సాగుపై రైతులు దృష్టి సారించేలా అధికారులు ప్రోత్సహించాలని తెలిపారు. రైతులకు పంట సాగులో అవసరమైన మెలకువలు, సూచనలు అందించాలని, నాణ్యమైన పంట దిగుబడి సాధించేలా కృషి చేయాలని తెలిపారు. ప్రభుత్వం సన్నరకం ధాన్యానికి బోనస్ అందిస్తున్నందున రైతులకు ఆర్థిక లాభం చేకూరేలా వచ్చే వానాకాలం సీజన్ లో సన్న రకం వడ్లను సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. జిల్లాలో దాదాపు 1 లక్ష 57 లక్షల ఎకరాలలో అంచనా మిగతా 2లో..

### మత్తు పదార్థాల వినియోగంపై

## ఉక్కుపాదం మోపాలి

ఆసిఫాబాద్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త

మత్తు పదార్థాల వినియోగంపై ఉక్కుపాదం మోపాలని జిల్లా కలెక్టర్ హరిత అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా నార్కోటిక్ కంట్రోల్ భ్యూరో సమావేశానికి అదనపు కలెక్టర్ యువరాజ్ మోర్మాట్, అదనపు ఎస్పి అడ్మిన్ చిత్ర రంజన్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గంజాయి సాగు చేసినా, వినియోగించినా, రవాణ చేసినా వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు సేవించడం వల్ల ఆరోగ్యాలు పాడై కుటుంబాన్ని ఆర్థికంగా తీవ్ర నష్టాన్ని మిగిలిస్తున్నారని, మత్తులో వుండి ఎన్నో నేరాలకు కారణమోతున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. గంజాయి సాగు చేసే వారిని గుర్తించి వారికి ప్రభుత్వమూ నుంచి అందే సంక్షేమ పథకాలను రద్దు మిగతా 2లో..



# మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన 2002 ఓటర్ల జాబితాలు https://ceotelangana.nic.in, https://ceotelangana.nic.in, ఓటర్ సర్వీస్ పోర్టల్ https://voters.eci.gov.in, https://voters.eci.gov.in లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జిల్లా, మండల స్థాయి అధికారులు తమ పరిధిలో పని చేస్తున్న ఉద్యోగులు (రెగ్యులర్, ఒప్పంద, పొరుగు సేవలు, దినసరి, ఇతరులు), వారి కుటుంబ సభ్యులు తాము నమోదు చేయబడిన పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన బూత్ స్థాయి అధికారులను సంప్రదించి 2002 ఓటర్ల జాబితాలో ఎన్నికల మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఫారం 6, 7, 8 ద్వారా అందిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి త్వరగా పరిష్కరించాలని, మరణించిన, ఇతర ప్రాంతాలకు మారిన ఓటర్ల వివరాలను గుర్తించి ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి పరిశీలించి వివరాలను ధ్రువీకరించి తొలగించాలని/ సవరించాలని తెలిపారు. ఒకే నియోజకవర్గంలో చిరునామా మార్చుకున్న ఓటర్లకు నోటీసులు జారీ చేసి సరైన చిరునామాలో ఓటు నమోదు చేయాలని, ఇతర నియోజకవర్గాలు మారిన ఓటర్లను ప్రస్తుత జాబితా నుండి తొలగించాలని తెలిపారు. జిల్లాలో డబుల్ ఓటర్లను గుర్తించి తొలగించాలని, ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమం పై ప్రజలలో అవగాహన కల్పించేందుకు దినపత్రికలు, స్థానిక ఛానల్లలో స్క్రోలింగ్ నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో కృషి చేసి విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాల వినియోగంపై ఉక్కుపాదం మోపాలి

(మొదటిపేజీ తరువాయి)

చేయాలన్నారు. ప్రతి ఒక్కరికి గంజాయి సేవించడం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కలిగించాలన్నారు. విద్యార్థులు, కళాశాల విద్యార్థులకు గంజాయి సేవించడం వల్ల ఉజ్వల భవిష్యత్తు దెబ్బతింటుందని వాటి వల్ల జరిగే నష్టాల పై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి గ్రామములో కళాజాత బృందాలతో గంజాయి సాగు, చేసిన, సేవించిన, రవాణ చేసే వారిపై కఠినచర్యలు ఉంటాయని ఆ దిశగా గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. మత్తు రహిత జిల్లాగా తీర్చిదిద్దేవిదంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలలో భాగంగా మత్తు పదార్థాలు సేవించడం వల్ల జరిగే నష్టాలపై ప్రతి ఒక్కరికి తెలియ పర్చాలన్నారు. మెడికల్ షాపులలో లభించే అధిక మోతాదు మందుల విక్రయాలపై తనిఖీలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో సంబందిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పదిలో ఉత్తమ ఫలితాలు సాధించిన మండల విద్యార్థులు

వేమనపల్లి, ఏప్రిల్ 29, ప్రభాతవార్త

మండలంలోని వేమనపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాల, నీల్వాయి కేజీబీవీ పాఠశాల, వేమనపల్లి ఎహెచ్ఎస్ బాలుర పాఠశాల, నీల్వాయి జడ్పీహెచ్ఎస్ ఇ/మీ వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. నీల్వాయి తెలుగు మీడియంలో 97 శాతం ఉత్తీర్ణత సాధించగా ఏహెచ్ఎస్ బాలుర ఆశ్రమ పాఠశాలకు చెందిన మడే వరుణ్ 546 మార్కులతో మండల టాపర్ గా నిలిచారు. అంతే కాకుండా రెండో స్థానంలో సీహెచ్ మనుష, జి. పావని 545 మార్కులు (కేజీబీవీ నీల్వాయి), ఎండి అల్వియా, కోదూరి రిషిత 545 మార్కులు (జడ్పీహెచ్ఎస్ నీల్వాయి) మూడో స్థానంలో ఎం. శశి వర్ధన్ 535 మార్కులు (జడ్పీహెచ్ఎస్ వేమనపల్లి) 522 మార్కులు ఒడిల అభిరామ్ సాధించినట్లు మండల విద్యాధికారి బొబ్బాల శ్రీధర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు వారి ప్రధానోపాధ్యాయులు బొబ్బాల శ్రీధర్ రెడ్డి, మాధవ్, గిరిధర్ రెడ్డి, మయూరి అభినందించారు.

## పదిలో కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

కాగజ్‌నగర్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:

తెలిపారు కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో విశిష్ట ప్రతిభ కనబరిచారని కరస్పాండెంట్ సూరవర్ధన్ తెలిపారు. ఈ విద్యాసంస్థకు ఈ సంవత్సరం పదవ తరగతి పరీక్షలకు మొత్తం 34 మంది విద్యార్థులు హాజరై, అందరూ ఉత్తీర్ణత సాధించి 100 శాతం ఫలితాన్ని నమోదు చేశారు. 34 మంది విద్యార్థుల్లో 500లకు పైగా మార్కులను 15 మంది విద్యార్థులు సాధించినట్లు తెలిపారు. పాఠశాల టాపర్లుగా యంసాని వైష్ణవి 600 మార్కులకు గాను 577 మార్కులు సాధించి ప్రథమ స్థానం పొందగా, పార్వతి నైతిక్స్ 552 మార్కులతో ద్వితీయ స్థానం, దోమల గగన్ రణేష్ 551 మార్కులతో తృతీయ స్థానం సాధించారు. అలాగే ధర్మాని సాయి చందన 545 మార్కులు, తేజస్ ధాత్రక్ 544 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు వేద ప్రవీణ్, జియా ఉల్ హక్ విద్యార్థులను అభినందిస్తూ, వారి విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో మరింత ఉన్నత ఫలితాలు సాధించాలని ఆకాంక్షి ంచారు.

## కాగజ్‌నగర్ మండలంలో పదవ తరగతి ఫలితాల్లో 87 శాతం ఉత్తీర్ణత

కాగజ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:

బుధవారం వెలువడిన పదవ తరగతి పరీక్షా ఫలితాలలో కాగజ్‌నగర్ మండలంలో 87 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు మండల విద్యాధికారి (ఎంఈవో) వాసాల ప్రభాకర్ తెలిపారు. మండలంలోని మొత్తం 573 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, అందులో 499 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి 87 శాతం ఫలితాన్ని నమోదు చేసినట్లు వెల్లడించారు. మండల స్థాయిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాస్పల్లి విద్యార్థి చకినాల కార్తీక్ 541 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచాడు. అలాగే కాగజ్‌నగర్‌కు చెందిన ప్రభుత్వ ఓల్డ్ హైస్కూల్ విద్యార్థిని గుర్లె శ్రీజ, కేజీబీవి పాఠశాల విద్యార్థిని జాడి సౌజన్య 525 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచారు. అదేవిధంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెట్రోల్ పంపు పాఠశాలకు చెందిన మరిశెట్టి వైష్ణవి 522 మార్కులు సాధించి తృతీయ స్థానాన్ని దక్కించుకున్నట్లు తెలిపారు. మండల స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మండల విద్యాశాఖ తరఫున హృదయపూర్వకంగా అభినందిస్తూ, భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఎంఈవో వాసాల ప్రభాకర్ ఆకాంక్షించారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు

(మొదటిపేజీ తరువాయి)

చేయడం జరిగిందని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని తెలిపారు. చెన్నూరు పరిధిలో హైమాస్ లైట్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఇందిరమ్మ ఇండ్ల పథకం మొదటి విడతలో దాదాపు 5 వేల 500 కోట్ల రూపాయలు విడుదల చేయడం జరిగిందని, ఈ విడతలో ఇండ్లు పొందిన లబ్ధిదారులు చేపట్టిన నిర్మాణ పనులకు దశలవారీగా క్షేత్రస్థాయిలో పరిశీలించి బిల్లులు చెల్లించడం జరుగుతుందని తెలిపారు. 2వ విడత కార్యక్రమాన్ని జూన్ మాసంలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆర్.టి.సి. కార్మికుల సమస్యలు పరిష్కరించి, వారి హక్కులను రక్షించేందుకు కమిటీ వేసి తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. నిరుద్యోగ యువతకు విదేశాలలో ఉపాధి అవకాశాలు కల్పించడంలో భాగంగా జర్మన్ భాషను నేర్పించి ఉద్యోగ కల్పన దిశగా కృషి చేస్తున్నామని తెలిపారు. అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ద్వారా నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు పెంపొందించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నూతన గృహప్రవేశ కార్యక్రమానికి హాజరయ్యారు. అంతకుముందు చెన్నూర్ మండల కేంద్రంలో గల శాసనసభ్యుల క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్, తహసిల్దార్లు రాఘవేంద్రరావు, వనజ రెడ్డిలతో కలిసి లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి/ షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. జిల్లా కలెక్టర్ అధికారులతో కలిసి చెన్నూరు మండల కేంద్రంలోని 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి, వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను పరిశీలించారు. అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ పనులు వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## అధిక పంట దిగుబడి సాధించేందుకు రైతులు మెలకువలు పాటించాలి

(మొదటిపేజీ తరువాయి)

పంట సాగు విస్తీర్ణం గుర్తించడం జరిగిందని తెలిపారు. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాలకు రైతులు నిబంధనల ప్రకారం ధాన్యం తీసుకువచ్చినట్లైతే ఎలాంటి కోతలు లేకుండా ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధరతో కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. రైతులకు అవసరమైన ప్యాడి క్లీనర్లు, కొనుగోలు కేంద్రాలలో తూకం యంత్రాలు, రైతులకు త్రాగునీరు, నీడ ఇతర సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. రైతులకు లబ్ధి చేకూరేలా పంట సాగు చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కాల్వ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ఘనంగా బ్రహ్మోత్సవాల వేడుకలు

దిలావర్‌పూర్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:



దిలావర్‌పూర్ మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కాల్వ శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయంలో బుధవారం నృసింహ జయంతి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు గురువారం ఆలయంలో అఖండ జ్యోతి స్థాపనతో ఉత్సవాలకు అంకురార్పణ చేస్తారు. మే ఒకటిన ధ్వజారోహణం, బలిహరణ, స్వామివారి కళ్యాణ మహోత్సవం జరిపిస్తారు. ఇలా తొమ్మిది రోజుల పాటు స్వామివారికి వివిధ సేవలను వేద పండితులు సంప్రదాయ ఆచారాల ప్రకారం నిర్వహిస్తారు. చివరి రోజు స్వామివారి రథోత్సవం, స్వామివారి నాగవెల్లి (మారువెల్లి) తో ఉత్సవాలు ముగుస్తాయి. ఇక్కడ స్వామివారి ఆలయంలో గంధాన్ని పచ్చి పసుపు, బియ్యం పిండితో ప్రత్యేక పద్ధతిలో సుమారు 60 పదుల వయసు గల అనుభవజ్ఞులు తయారుచేసి సమర్పిస్తారు, అదే గంధాన్ని భక్తులకు ఇస్తారు. వందల సంవత్సరాల చరిత్ర గల ఈ ఆలయ బ్రహ్మోత్సవాలకు ప్రతి ఏటా సుమారు 50 వేల భక్తులు వస్తారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మే 1వ తేదీన స్వామివారి కల్యాణోత్సవం అనంతరం భక్తులందరికీ మహా అన్న ప్రసాద వితరణ ఉంటుంది, వివిధ భక్తుల సహకారంతో నిత్యాన్నదాన కార్యక్రమాలు కూడా నిర్వహిస్తారు. ఈ తొమ్మిది రోజుల పాటు భక్తుల రాక పెరిగి ప్రత్యేక పూజలు, భక్తుల జయజయధ్వానాలు, భజన గీతాలతో ఆలయ పరిసరాలు భక్తి భావంతో నిండిపోయాయి. మొత్తం ప్రాంగణం పండుగ వాతావరణాన్ని తలపిస్తూ ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. బ్రహ్మోత్సవాల సందర్భంగా రాబోయే రోజుల్లో వివిధ విశేష సేవలు, ప్రత్యేక హోమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ ఉత్సవాలు ప్రాంత ప్రజల భక్తి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తున్నాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## లక్షెట్టిపేట మండల విద్యార్థులు అద్భుత ప్రతిభ

**- మండల విద్యాధికారి జి. శైలజ**

లక్షెట్టిపేట, ఏప్రిల్ 29, ప్రభాతవార్త

పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాల్లో తెలంగాణ రాష్ట్రంలో లక్షెట్టిపేట మండల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు అని మండల విద్యాధికారి జి. శైలజ తెలిపారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఉత్తమ ఫలితాలు సాధించడంతో పాటు మంచి ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి జి. శైలజ మాట్లాడుతూ.. మొత్తం విద్యార్థులు 703 కు గాను 686 మంది విద్యార్థులు పాసయ్యారు 97.5 శాతం ఉత్తీర్ణత సాధించడం జరిగింది. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల నుంచి మొదటి స్థానం ఎం . రిషిక 567 మార్కులు ( జడ్.పి.హెచ్.ఎస్ గర్ల్స్, లక్షెట్టిపేట), రెండో స్థానం తిరుమల 562 మార్కులు ( జడ్పిహెచ్ఎస్ గర్ల్స్, లక్షెట్టిపేట), మూడో స్థానం వి. స్ఫూర్తి 557 మార్కులు ( జెడ్పిహెచ్ఎస్ వెంకట్రావుపేట్) అనే ముగ్గురు విద్యార్థులు టాప్ మార్కులు సాధించారు. అదేవిధంగా మండల స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలైన జడ్.పి.హెచ్.ఎస్ జెండా వెంకటాపూర్, జడ్.పి.హెచ్.ఎస్ వెంకట్రావుపేట, కేజీబీవీ లక్షెట్టిపేట, సిఎస్ఐ రైడల్ హై స్కూల్ 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి. మండలంలోని విద్యార్థులు, ఉపాధ్యాయులు సమిష్టిగా కృషి చేసి ఈ అద్భుత ఫలితాలు సాధించారని, భవిష్యత్తులో కూడా విద్యార్థులు మరింత ఉన్నత లక్ష్యాలను సాధించాలని మండల విద్యాధికారి ఆకాంక్షించారు. మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులను అభినందిస్తూ ఆమె శుభాకాంక్షలు తెలిపారు.

## సారంగాపూర్ మండల టాపర్‌గా నిలిచిన ముస్కాన్

**సారంగాపూర్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:**



సారంగాపూర్ మండల కేంద్రంలోని వివేకానంద పాఠశాలకు చెందిన సయ్యద్ ముస్కాన్ పదవ తరగతి ఫలితాల్లో అత్యున్నత ప్రతిభ కనబరిచారు. 600 మార్కులకు గాను 573 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచారు. ఈ సందర్భంగా ఆమెను వివేకానంద పాఠశాల కరస్పాండెంట్ సముద్రాల గీత, ప్రధానోపాధ్యాయురాలు విమల, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థిని సాధించిన ఈ ఘనత పాఠశాలకు గర్వకారణమని యాజమాన్యం పేర్కొంది. ముస్కాన్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు.



## ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ

**లక్షెట్టిపేట, ఏప్రిల్ 29, ప్రభాతవార్త**

లక్షెట్టిపేట మున్సిపాలిటీ 13వ వార్డులో మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, సురేఖ ఆశీస్సులతో ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకోవడానికి లబ్ధిదారులకు ఇంటి ముగ్గు వేయడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పేద ప్రజల కోసమే కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతమైందని, లబ్ధిదారులు ఇంటి నిర్మాణాన్ని వీలైనంత తొందరలో పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పన్ దొంత అంజలి నరసయ్య, వార్డు కౌన్సిలర్ బిరుదుల సత్యనారాయణ, కో ఆప్షన్ మెంబర్ సయ్యద్ జైనిన్ హాజీ, సయ్యద్ హఫీజ్, ఇక్బాల్, లగిశెట్టి వెంకట్ స్వామి, మోహన్, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉరివేసుకుని యువకుడి ఆత్మహత్య

**హాజీపూర్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త**



బ్యాంకు లోన్ ఈఎంఐలు చెల్లించలేక వడ్డేపెల్లి రవీందర్ అనే యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం కర్ణమామిడి గ్రామానికి చెందిన వడ్డేపెల్లి రవీందర్ (40) మేస్త్రిగా పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. రవీందర్ గత రెండు సంవత్సరాల క్రితం ప్రైవేట్ బ్యాంక్‌లో లోన్ తీసుకుని ఇల్లు కట్టుకున్నాడు. అట్టి బ్యాంకు లోన్ ఈఎంఐలు సమయానికి కట్టలేక జీవితంపై విరక్తి చెంది మనస్తాపంతో బుధవారం రోజు తెల్లవారు జామున తన ఇంటి ముందు చీరతో ఉరి వేసుకుని చనిపోయాడు. మృతుడి భార్య వడ్డేపెల్లి రమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్ఐ తెలియజేశారు. మృతునికి భార్య రమ, కొడుకు అక్షిత్, కూతురు వైశాలి కలరు.

## ఉద్యోగ మేళా గోడప్రతుల ఆవిష్కరణ

**నిర్మల్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:**



ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా యువతకు ఉద్యోగ కల్పన కోసం ఏర్పాటు చేసిన జాబ్ మేళా గోడ ప్రతులను జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 6వ తేదీన ఆదిలాబాద్‌లో ఏర్పాటు చేయనున్న జాబ్ మేళాలో అర్హులైన నిరుద్యోగ యువత పాల్గొనవచ్చని తెలిపారు. పోస్టర్‌లోని క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా లేదా హెచ్‌టీటీపీఎస్://ఎస్ఏటీజీ.తెలంగాణ.జీవీ.ఇన్/ప్రజాపాలన వెబ్‌సైట్ ద్వారా తమ పేరును నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల మేనేజర్ నరసింహారెడ్డి, యువజన క్రీడల అధికారి శ్రీకాంత్ రెడ్డి, ఉపాధి కల్పన అధికారి విజయలక్ష్మి త పాల్గొన్నారు.

# అక్రమ నిర్బంధంపై బీఆర్ఎస్ నేతల ఆగ్రహం






పోలీస్ స్టేషన్‌లో నిరసన తెలుపుతున్న బిఆర్ఎస్ నాయకులు

**దిలావర్‌పూర్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:**

రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ పిలుపు ప్రభావంతో దిలావర్‌పూర్ మండలంలో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా బీఆర్ఎస్‌వీ నాయకులను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మండల ఇన్‌ఛార్జ్ చిన్నారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని, దీనివల్ల వారి భవిష్యత్తు దెబ్బతింటోందని విమర్శించారు. తమను అక్రమంగా నిర్బంధించడం అన్యాయమని నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిధులు విడుదలయ్యే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేస్తూ ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాథోడ్ అశోక్, కొప్పుల శ్రీనివాస్, జాన్ సత్యం పాల్గొన్నారు.

**బెల్లంపల్లి, ఏప్రిల్, 29, ప్రభాతవార్త**

రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ. 8 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ, ఎయిడెడ్, వృత్తి విద్యా కళాశాలల బంద్‌కు పిలుపు ఇచ్చిన నేపథ్యంలో, బిఆర్ఎస్వీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బడికల శ్రావణ్‌తో పాటు జిల్లా నాయకులు జీలకర మహేష్, నస్పూరి శివకుమార్, కంపెల్లి శ్రీకాంత్, కుర్మా దినేష్‌లను పోలీసులు తెల్లవారుజామున 4 గంటల సమయంలో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని మంచిర్యాల జిల్లా రామకృష్ణపూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ అరెస్టులు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఈ సందర్భంగా బడికల శ్రావణ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే పెండింగ్‌లో ఉన్న రూ. 8 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడంలో వేగం చూపుతుండగా, 20 లక్షలకు పైగా విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆలస్యమవడం వల్ల విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఆయన అన్నారు. కాలేజీ యాజమాన్యాలు ఫీజులు చెల్లించకపోతే సర్టిఫికేట్లు ఇవ్వబోమని చెప్పడంతో, విద్యార్థుల తల్లిదండ్రులు ఆస్తులు తాకట్టు పెట్టి డబ్బులు సమకూర్చుకునే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను పూర్తిగా విడుదల చేసే వరకు బిఆర్ఎస్వీ ఉద్యమం కొనసాగుతుందని బడికల శ్రావణ్ స్పష్టం చేశారు.

## పది ఫలితాల్లో అల్ఫోన్సా విద్యార్థుల ఉత్తమ ప్రతిభ

**క్యాతన్‌పల్లి, ఏప్రిల్ 29, ప్రభాతవార్త**

రామకృష్ణాపూర్ పట్టణంలోని అల్ఫోన్సా పాఠశాల విద్యార్థులు బుధవారం విడుదలైన పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. పరీక్షలకు హాజరైన అందరు ఉత్తీర్ణత సాధించారు. ఎం. సాయి కీర్తన 562/600, ఈ. ఆరాధ్య 558/600, అబ్దుల్ రహీం 557/600 మార్కులు సాధించినట్లు యాజమాన్యం తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## పదో తరగతి ఫలితాల్లో గుడ్ షెఫర్డ్ స్కూల్ ప్రభంజనం

**లక్షెట్టిపేట, ఏప్రిల్ 29, ప్రభాతవార్త**



బుధవారం వెలువడిన పదో తరగతి ఫలితాల్లో మండలంలోని గుడ్ షెఫర్డ్ స్కూల్ కు చెందిన టీ. శ్రీనిత్య 581 మార్క్స్ సాధించి మండలంలో మొదటి ర్యాంక్‌లో నిలిచిందని పాఠశాల కరెస్పాండెంట్ వై. శ్రీనివాస్ తెలిపారు. పాఠశాలలో 59 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 59 మంది విద్యార్థులు పాస్ అయ్యారు అని తెలిపారు. ఇందులో 29 మంది విద్యార్థులు 500 పైన మార్కులు సాధించారు. వీరిని పాఠశాల ప్రిన్సిపాల్ సెబాస్టియన్, డైరెక్టర్ గౌతమ్, ఉపాధ్యాయులు అభినందించారు.

## ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు


**భైంసా, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:**



భైంసా మండలంలోని వాలెగాం గ్రామంలో అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఇందులో భాగంగా ముందుగా గ్రామ సర్పంచ్ కాంబ్లె అశోక్ బుద్ధుడు, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి పంచరంగి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ కాలనీలోని బస్టాండ్ వద్ద గల బుద్ధ విహార్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రజ్ఞాశీల యూత్ అధ్యక్షులు దగ్గే పిరాజీ, సాదోళ్ళ సంజయ్, కాంబ్లె శరత్, కాంబ్లె గదయానంద్, బన్సూడే పరశురామ్, జంగమె అవినాష్, సిహెచ్ ఎల్లన్న, గాయకవాడ్ రాజు, అధ్యక్షులు నరేష్, యూత్ అధ్యక్షులు గంగాధర్, అజయ్, మహిళలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## శాంతి భద్రతల రక్షణ ప్రధానం

**జైపూర్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త**



మండలం లోని ప్రజల శాంతి భద్రతల రక్షణ ప్రధానంగా పోలీసులు విధులు నిర్వహిస్తామని, ప్రజలు సహకరించాలని ఎస్.ఐ లింగంపల్లి భూమేష్ అన్నారు. బుధవారం ఆయన జైపూర్ ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తానని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ, గంజాయి,ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, మహిళలు, బాలల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. ప్రజలు పోలీసు సేవలను సద్వినియోగం చేసుకోవాలని, ఎలాంటి సమస్య ఉన్నా నిర్భయంగా స్టేషన్‌కు రావాలని సూచించారు.

## ఎస్.సి కార్పొరేషన్ రుణ దరఖాస్తుదారుల ఎంపిక

**జైపూర్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త**

ఎస్.సి కార్పొరేషన్ రుణాల కొరకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులను ఎంపిక చేయుటకు బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో గుర్రం సత్యనారాయణ మాట్లాడుతూ మండలంలోని 4 బ్యాంకులకు 24 యూనిట్లు మంజూరు కాగా, 137 మంది దరఖాస్తు చేసుకున్నారని, సంబంధిత బ్యాంకు మేనేజర్లతో కలిసి లబ్ధిదారులను ఎంపిక చేయడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శివలీల ఎంపీ ఓ శ్రీపతి బాపు, సూపరింటెండెంట్ జి.భాగ్యలక్ష్మి, సంబంధిత బ్యాంకుల మేనేజర్లు సుధీర్ కుమార్ టిజిబి జైపూర్, అనీష్ టిజిబి ఇందారం, రాకేష్ టిజీబీ కుందారం, అమిత్ కుమార్ ప్రజా పరిషత్ కార్యాలయ సిబ్బంది, ఇతర అధికారులు దరఖాస్తుదారులు హాజరయ్యారు.



# సైబర్ క్రైమ్‌పై అవగాహన కలిగి ఉండాలి

## - జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్



**మంచిర్యాల బ్యూరో, ఏప్రిల్ 29, ప్రభాతవార్త**

సైబర్ మోసాలను అరికట్టేందుకు సైబర్ క్రైమ్ పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్ అన్నారు. బుధవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లా కేంద్రంలోని నర్సింగ్ కళాశాలలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సమావేశానికి ఎస్.ఐ. మధుసూదన్, కళాశాల ప్రిన్సిపల్ కె. సుజాత, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఆనంద్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ శాఖ అధికారి మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. విద్యార్థులు సైబర్ నేరాల రకాలు, రక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలు, ఆన్లైన్‌లో సురక్షితంగా ఉండే విధానాలను తెలుసుకొని ఉండాలని అన్నారు. సైబర్ నేరాలకు సంబంధించి అత్యవసర సహాయం కోసం సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నం.1930, పిల్లల సమస్యల కోసం చైల్డ్ హెల్ప్ లైన్ నం.1098లో సంప్రదించవచ్చని తెలిపారు. విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద కాల్స్, సందేశాలు, లింక్ లతో జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పదో ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించిన రాఘవేంద్ర విద్యాసంస్థలు

**జన్నారం, ఏప్రిల్ 29, ప్రభాతవార్త**

బుధవారం విడుదలైన పదో తరగతి ఫలితాల్లో రాఘవేంద్ర విద్యా సంస్థలు 100 శాతం ఉత్తీర్ణత సాధించిందని రాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ ఎర్ర చంద్రశేఖర్ అన్నారు.రాఘవేంద్ర లిటిల్ హాన్స్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌కు చెందిన కాశెట్టి వైష్ణవి 600 మార్కులకు గాను 573 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. ఈ పాఠశాలలో పరీక్ష రాసిన 44 మంది విద్యార్థులకు గాను 44 మంది 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. వారిలో 34 మంది విద్యార్థులు 500 మార్కులకు పైగా సాధించి ప్రతిభ చాటారు.అలాగే రాఘవేంద్ర జయరాణి హై స్కూల్‌కు చెందిన కండ్లె హర్షిత 600 మార్కులకు 577 మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచింది. ఈ పాఠశాలలో పరీక్ష రాసిన 14 మంది విద్యార్థులకు గాను 14 మంది 100 శాతం ఉత్తీర్ణత సాధించారు.ఈ విజయం సాధించిన విద్యార్థులను రాఘవేంద్ర విద్యాసంస్థల అధినేత ఎర్ర చంద్రశేఖర్, కరస్పాండెంట్ ఎర్ర సంపత్, ప్రిన్సిపాళ్లు ఏ.శ్రీనివాస్, ఎస్.మధుసూదన్, డీన్ హేమలత షిండే, ఉపాధ్యాయులు అభినందించారు.విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల సమిష్టి కృషి వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని యాజమాన్యం పేర్కొంది.



## ప్రశాంతంగా ముగిసిన క్యాతన్‌పల్లి పాలకవర్గ సమావేశం

**క్యాతన్‌పల్లి, ఏప్రిల్ 29, ప్రభాతవార్త**

తీవ్ర ఉద్రిక్తతల మధ్య కొలువు దీరిన క్యాతన్‌పల్లి పాలక వర్గ తొలి సమావేశం ప్రశాంతంగా జరిగింది. చైర్‌పర్సన్ గోడిశేల సంధ్యా రాణి అధ్యక్షత వహించారు. మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ ఎజెండా అంశాలు సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ 33 అంశాలను ప్రవేశ పెట్టగా ఏక గ్రీవంగా ఆమోదించినట్లు తెలిపారు. మౌలిక వసతుల కల్పనకు కృషి చేయనున్నట్లు తెలిపారు.

## నిర్మల్ విజయ స్కూల్‌లో పదవ తరగతి ఫలితాల సందడి

**నిర్మల్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త**

నిర్మల్ పట్టణంలోని విజయ స్కూల్ పదవ తరగతి విద్యార్థులు ఈ ఏడాది ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచారు. ఈ ఫలితాల్లో డి. మేఘన 578 మార్కులతో పాఠశాలలో ప్రథమ స్థానం సాధించి అందరి ప్రశంసలు అందుకుంది. ఏ. విశ్వతేజ 573 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలవగా, ఏ. శివ ప్రియ 569 మార్కులతో తృతీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. పాఠశాల మొత్తం ఫలితాలు విశేషంగా నిలిచాయి. 16 మంది విద్యార్థులు 550కి పైగా మార్కులు సాధించగా, 88 మంది విద్యార్థులు 500 మార్కుల మైలురాయిని దాటారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల కృషి, పట్టుదల, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం వల్లే ఈ ఘన విజయం సాధ్యమైందని పాఠశాల ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు మరింత వెలుగొందాలని, వీరంతా ఉన్నత స్థాయికి చేరుకోవాలని యాజమాన్యం ఆకాంక్షించింది. విజేతలను తల్లిదండ్రులు, తోటి విద్యార్థులు అభినందనలతో ముంచెత్తారు.



లక్ష్మణచాంద ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజేందర్

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి

**లక్ష్మణచాంద, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:**

లక్ష్మణచాంద మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజేందర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా వడదెబ్బపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సిబ్బందికి తెలిపారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఆశా కార్యకర్తల వద్ద అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అర్హులైన బాలికలందరూ హెచ్‌పీవీ వ్యాక్సిన్ తీసుకునేలా అవగాహన కల్పించాలని కోరారు. ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించి, పిల్లలందరికీ సకాలంలో టీకాలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పవన్, డిప్యూటీ జిల్లా విస్తరణ మరియు మీడియా అధికారి బారె రవీందర్, వైద్యులు ప్రత్యూష, రాణా ప్రతాప్ పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జి విఠల్ రెడ్డి

**భైంసా, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:**

తానూరు మండలంలోని హిపనెల్లి గ్రామంలో పిల్లోడే పోసాని సిద్దు ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవ కార్యక్రమం సర్పంచ్ చంద్రే గంగసాగర, శివరాం ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన మాజీ శాసనసభ్యులు జి. విఠల్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇల్లు లేని నిరుపేద కుటుంబాల కోసం నియోజకవర్గానికి 3500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశారని తెలిపారు. ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరుగుతుందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావుకు నియోజకవర్గ ప్రజల తరఫున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ రాజన్న, మాజీ ఆత్మ చైర్మన్ పోతరెడ్డి, ఉపసర్పంచ్ గంగాధర్, వార్డు సభ్యులు దత్తు, సాయినాథ్, రాజు, వీడీసీ అధ్యక్షులు శివరాజ్, మాజీ సర్పంచ్ శ్యాం పటేల్, నాయకులు పీరాజీ, దత్తురాం, అశోక్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.





## పదవీ విరమణ పొందనున్న డిజిఎం శ్రీనివాసరావుకు ఘన సన్మానం

**బెల్లంపల్లి, ఏప్రిల్ 29, ప్రభాతవార్త**

ఈ నెలలో పదవీ విరమణ పొందనున్న సింగరేణి డీజీఎం (స్టోర్స్) వేలూరి శ్రీనివాసరావును బుధవారం బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. జీఎం ఎం. విజయ భాస్కర్ రెడ్డి ఏరియా అధికారులతో కలిసి ఆయనకు శాలువా కప్పి, జ్ఞాపిక అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన జీఎం విజయ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ శ్రీనివాసరావు సింగరేణి సంస్థకు అందించిన సేవలను ప్రశంసించారు. క్రమశిక్షణ, నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ సంస్థ అభివృద్ధికి ఆయన చేసిన కృషి ఆదర్శనీయమని పేర్కొన్నారు. తన సేవల గురించి మాట్లాడిన వేలూరి శ్రీనివాసరావు, సుమారు 35 సంవత్సరాల పాటు సింగరేణిలో వివిధ హోదాల్లో పనిచేసి ఉన్నతాధికారుల ప్రశంసలు పొందడం తనకు గర్వకారణమని తెలిపారు. సహచరుల సహకారంతోనే తన సేవలను విజయవంతంగా పూర్తి చేయగలిగానని పేర్కొన్నారు. వక్తలు కూడా ఆయన నిస్వార్థ సేవలను కొనియాడుతూ, భవిష్యత్తులో ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధికారి మచ్చగిరి నరేందర్, ఏరియా ఇంజినీర్ జి. కృష్ణమూర్తి, డీవైసీఎంఓ పాండురంగాచారి, డీజీఎం (సివిల్) ఎస్కే మదీనా భాషా, ప్రాజెక్ట్ ఇంజినీర్ వీరన్న, డీజీఎం (ఐఈడీ) ఉజ్వల్ కుమార్ బెహరా, పర్సనల్ హెచ్ఓడీ ఎస్వీ రాజేశ్వర్ రావు తదితర విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

## 10వ తరగతి ఫలితాల్లో గ్రీన్‌వుడ్ విద్యార్థుల విజయ పతాకం

**క్యాతన్‌పల్లి, ఏప్రిల్ 29,ప్రభాతవార్త**

క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ 9వ వార్డు, అమ్మ గార్డెన్స్ ప్రాంతంలో గ్రీన్‌వుడ్ పాఠశాల విద్యార్థులు పదో తరగతి పరీక్ష ఫలితాల్లో విజయ పతాకం ఎగుర వేశారు. ఎం. నిహాల్ 600 మార్కులకు గాను 581, ఎస్ తనుశ్రీ 578, సిహెచ్, తేజస్విని 577 మార్కులు సాధించారు. అలాగే 31 మంది విద్యార్థులకు గాను 27 మంది విద్యార్థులు 500 మార్కులకు పైచిలుకు మార్కులు సాధించడమే కాకుండా వందకు వందశాతం ఉత్తీర్ణత సాధించినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రమోహన్ తెలిపారు. మంచి ఫలితాలు సాధించినందుకు గాను విద్యార్థులను, ఉపాధ్యాయులను పాఠశాల డైరెక్టర్ భరద్వాజ్ నాయుడు, ఏజిఎం పవన్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ తిరుపతి, హెడ్ మిస్ ట్రెన్ క్రిస్టినా,ఏవో ఖద్దూస్ లను అభినందించారు

## పదవ తరగతి ఫలితాలలో తవక్కల్ విద్యార్థుల ప్రభంజనం

**క్యాతన్‌పల్లి, ఏప్రిల్ 29, ప్రభాతవార్త**

పదవ తరగతి ఫలితాలలో తవక్కల్ పాఠశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. బుధవారం వెలువడిన 10వ తరగతి ఫలితాల్లో రామకృష్ణాపూర్ పట్టణంలోని తవక్కల్ పాఠశాల విద్యార్థులు ఆర్.మాధురి 576 మార్కులు, ఏ. సాహిథ్ 570 మార్కులు సాధించారు,8 మంది విద్యార్థులు 560 పై మార్కులతో ఉత్తమ ఫలితాలు సాధించారని తవక్కల్ విద్యాసంస్థల చైర్మన్ అబ్దుల్ అజీజ్ తెలియచేశారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాదించుటకు కృషి చేసిన ఉపాధ్యాయులను అభినందించారు.

## పది ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

**పెంచికల్‌పేట్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త**

బుధవారం వెలువడిన పదవ తరగతి ఫలితాల్లో మండలంలోని పాఠశాలలు విశేష ప్రతిభ కనబరిచాయి. మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం ( కేజీబీవీ ), పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి సత్తా చాటారు. కస్తూరిబా విద్యాలయంలో 37 మంది విద్యార్థులందరూ ఉత్తీర్ణులు కావడంతో వందశాతం ఫలితాలు నమోదయ్యాయి. మరోవైపు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 57 మంది విద్యార్థుల్లో 54 మంది ఉత్తీర్ణులు కావడంతో 94.07 శాతం ఉత్తీర్ణత నమోదైంది. విద్యార్థుల ప్రతిభపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.





పోస్టర్ ద్వారా అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ డీఎం హెచ్ఓ సుధాకర్ నాయక్

## క్షయ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి

### - డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సుధాకర్ నాయక్

**తాండూర్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త :**

క్షయ వ్యాధి లక్షణాలు, చికిత్స, నివారణ గురించి ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ సుధాకర్ నాయక్ తెలిపారు. ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్లో భాగంగా మాదారం గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారంక్షయవ్యాధి నిర్ధారణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ వ్యాధి గ్రస్తులందరినీ పరీక్షించి పూర్తిగా చికిత్స అందించడం ద్వారా వ్యాధిని నిర్మూలించవచ్చన్నారు.క్షయ వ్యాధి వ్యాప్తి చెందకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని కోరారు.క్షయ వ్యాధి వ్యాప్తి చెందకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచనలు గురించి పోస్టర్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ శిబిరంలో సర్పంచ్ కుశనపల్లి లక్ష్మణ్, డాక్టర్ యూస్రీరాణి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సత్తయ్య, క్షయ వ్యాధి డివిజన్ సూపర్వైజర్ శ్రీపెల్లి కలకాంత్, గ్రామ కార్యదర్శి అల్లాద్దీన్, హెల్త్ సూపర్వైజర్ తార, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ల్యాబ్ టెక్నీషియన్ హాకీం, ఏఎన్ ఎంలు పుష్పలత, పద్మ, శ్రవంతి, ఆశా కార్యకర్తలు కవిత, జయ, మల్లీశ్వరి, లక్ష్మి, సావిత, వైఆర్జీ కేర్ ఎల్ డబ్ల్యూలు సరళ, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.



## టెన్త్ ఫలితాలలో విద్యా భారతి ప్రభంజనం

**తాండూర్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త :**

పదో తరగతి పరీక్ష ఫలితాలలో మండల కేంద్రంలోని విద్యా భారతి ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు.ఉమ్మెసబియా 583 మార్కులతో బెల్లంపల్లి నియోజకవర్గం టాపర్ గా నిలిచారు. సహస్ర 578 మార్కులు, ఎం తరుణి 577మార్కులు, కె అంజలి 575 మార్కులు, తహస్య రాఘవి 575 మార్కులతో ఉత్తీర్ణత సాధించారు.79 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 100 శాతం ఫలితాలు సాధించారు.పాఠశాల కరస్పాండెంట్ సురభి శరత్ కుమార్, డైరెక్టర్ సౌమ్య, ప్రిన్సిపాల్ సహాయ సరోజిని అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు.

## టెన్త్ పరీక్ష ఫలితాలు ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

**తాండూర్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త :**

పదో తరగతి పరీక్ష ఫలితాలలో తాండూర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మండల విద్యాధికారి శ్రీనివాస్ తెలిపారు. మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలకు చెందిన పనస అక్షిత వర్మ 575 మార్కులు, తాండూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని తేజస్వి 560 మార్కులు, అచలాపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన చీర్ల హరి చరణ్ 559 మార్కులు, కస్తూరిబా బాలికల విద్యాలయానికి చెందిన పెట్టం స్నేహిత 559 మార్కులతో ఉత్తీర్ణత సాధించారన్నారు. మండలంలోని జెడ్ పి హెచ్ ఎస్ అచలాపూర్ 93.75 శాతం, జెడ్ పి హెచ్ ఎస్ రేచిని 100 శాతం, జెడ్ పి హెచ్ ఎస్ తాండూర్ 98.68 శాతం, జడ్పీ హెచ్ ఎస్ తంగళ్ళపల్లి 90 శాతం,జెడ్పిహెచ్ఎస్ తాండూర్ ఉర్దూ మీడియం 100 శాతం,కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం 100 శాతం,మహాత్మ జ్యోతిబాపూలే 100 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ తెలిపారు.

## మండలంలో 87 శాతం ఉత్తీర్ణత

**చింతలమానేపల్లి, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:**

పదో తరగతి ఫలితాల్లో మండలంలోని విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు.మండల వ్యాప్తంగా 87 శాతం ఉత్తీర్ణత నమోదైంది.మండల విద్య శాఖ అధికారి జయరాజ్ తెలిపారు.మండలంలోని మొత్తం 290 మందివిద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 251 మంది ఉత్తీర్ణులయ్యారు. శ్రీ గాయత్రి విద్యా మందిర్కు చెందిన వడ్డేపల్లి వినయ్ 567 మార్కులతో మండల ప్రథమ స్థానంలో నిలవగా, అదే పాఠశాలకు చెందిన చకలీ సుభాష్ 557 మార్కులతో ద్వితీయ స్థాన సాధించాడు.మండలంలోని కేజీబీవీ, ఏహెచ్ఎస్ కేతిని,గంగాపూర్, బాబాపూర్ ప్రభుత్వ పాఠశాలలు100 శాతం ఫలితాలు సాధించాయి.మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులను, మండల విద్యాశాఖ అధికారి అభినందించారు.

# కేసుల సత్వర పరిష్కారం కోసం కృషి చేయాలి

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త :**



జిల్లా న్యాయమూర్తి ఎ.వీరయ్యను మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్

జిల్లా న్యాయస్థాన సముదాయంలో కొనసాగుతున్న అండర్ ట్రయల్ కేసుల సత్వర పరిష్కారం కోసం కృషి చేయాలని జిల్లా న్యాయమూర్తి ఎ.వీరయ్య అన్నారు. బుధవారం జిల్లా న్యాయస్థాన సముదాయంలోని జిల్లా న్యాయమూర్తి కార్యాలయంలో సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవ అధికారి వి. సంకేత్ మిత్ర, జిల్లా కలెక్టర్ కె. హరిత, జూనియర్ సివిల్ జడ్జ్ జె.అనంతలక్ష్మి ౖ, ప్రత్యేక సబ్ జైల్ పర్యవేక్షకులు ప్రేమ్ కుమార్ లతో కలిసి కేసులకు సంబంధించి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తి మాట్లాడుతూ జిల్లాలో ఉన్న అండర్ ట్రయల్ కేసులకు సంబంధించి కేసుల సత్వర పరిష్కారం కోసం అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. అండర్ ట్రయల్ కేసులలో కక్షిదారుల పరిస్థితి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. చార్జ్ షీట్ వేసిన, వేయని కేసులకు సంబంధించి వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలని తెలిపారు. బెయిల్ మంజూరు అయిన వెంటనే నిర్ణీత నిబంధనలను పాటిస్తూ సంబంధిత వ్యక్తులను విడుదల చేయాలని, అండర్ ట్రియల్ కేసులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ముందుగా జిల్లా కలెక్టర్ హరిత జిల్లా న్యాయమూర్తి ఎ.వీరయ్యను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వివాహ వేడుకల్లో పాల్గొని వధూవరులను ఆశీర్వదిస్తున్న యువనేత బాజీరావు పాటిల్

## పలు వివాహ వేడుకల్లో పాల్గొన్న యువనేత బాజీరావు పాటిల

**భైంసా, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:**

ముధోల్ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన వివాహ వేడుకల్లో యువ నాయకులు బాజీరావు పాటిల్ పాల్గొన్నారు. కుంటాల మండలం అంబుగాం గ్రామంలో కంఠాలె పటేల్ కుమార్తె వివాహానికి, కుబీర్ మండలం జాం గ్రామంలో కిషన్ పటేల్ కుమారుడు, బద్దుల గంగాధర్ కుమారుడు రమేష్ వివాహ వేడుకలకు హాజరయ్యారు. అలాగే మోల గ్రామ సర్పంచ్ కదం జయవంతరావు తమ్ముడు అశోక్ కుమార్తె వివాహానికి, ముధోల్ మండలం బోర్గాం గ్రామంలో కల్లెడ సాయన్న కుమార్తె వివాహ వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. భైంసా మండలం హస్గుల్ గ్రామంలో కదం విఠల్ కుమారుడు దిలీప్ వివాహానికి, తానూర్ మండలం ఎల్వత్ గ్రామ సర్పంచ్ సంతోష్ కదం అన్న కుమార్తె వివాహ వేడుకకు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలుపుతూ వారి జీవితం సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గంగపుత్ర సంఘం నూతన కమిటీ ఎన్నిక

**లక్సెట్టిపేట, ఏప్రిల్ 29, ప్రభాతవార్త**

మున్సిపాలిటీ పరిధిలోని మొదల లో గంగపుత్ర సంఘం నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది. మొదెల గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో బుధవారం రోజున ఎలక్షన్ ఆఫీసర్ గుండ సందీప్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఎలక్షన్స్ లో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. నూతన కమిటీ అధ్యక్షులుగా మేడి గణేష్, ఉప అధ్యక్షులుగా చిట్యాల రమేష్, కార్యదర్శిగా మగ్గిడి రాజేష్, డైరెక్టర్లుగా గుమ్ముల సత్తన్న, మేడి లచ్చన్న, కుమ్మరి శ్రీనివాస్,మేడి నర్సయ్య, బోరె మల్లేష్, బోరె సుభాష్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నుకోబడిన కమిటీకి మార్కెట్ కమిటీ డైరెక్టర్ తోట రమేష్ శాలువాతో ఘనంగా సన్మానించి, అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## లక్ష్మణచాంద మండలంలో అద్భుత ఫలితాలు

### - పాఠశాలల్లో 100 ఉత్తీర్ణత

**లక్ష్మణచాంద, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:**

లక్ష్మణచాంద మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ఈసారి 100 ఉత్తీర్ణత సాధించాయని మండల విద్యాధికారి అశోక్ వర్మ తెలిపారు. వద్యాల్, పీచర, లక్ష్మణచాంద ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఈ ఏడాది అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాయి. జెడ్పీహెచ్ఎస్ లక్ష్మణచాంద పాఠశాలకు చెందిన బి. అవినాష్ 567 మార్కులతో, బి. కీర్తన 553 మార్కులతో మండల టాపర్లుగా నిలిచారు. కస్తూర్బా గాంధీ విద్యాలయం (కేజీబీవీ) లోని 55 మంది విద్యార్థులు 100 ఉత్తీర్ణతతో అద్భుత ప్రతిభ చాటారు. ఇందులో 23 మంది విద్యార్థులు 500లకు పైగా మార్కులు సాధించగా, ఎన్. స్నేహలత 547, ఎస్. అమూల్య 545, ఎన్. కృతిక 541 మార్కులు సాధించారు. కేజీబీవీ స్పెక్టోరియల్ ఆఫీసర్ నవిత మాట్లాడుతూ విద్యార్థుల కృషి, పట్టుదల, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం వల్లే ఈ ఘన విజయం సాధ్యమైందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను, ఉపాధ్యాయులను అధికారులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.



## సైకాలజిస్టుల దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలి

### - మే 5 నుంచి 10 వరకు జిల్లాలో అవగాహన కార్యక్రమాలు

**నస్పూర్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త**

హైదరాబాద్లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సైకాలజిస్టుల దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు రంగు వేణు కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం నస్పూర్ లోని కలెక్టరేట్ రోడ్డులో గల ప్రకృతిమిత్ర కార్యాలయంలో జిల్లా సైకాలజిస్టుల ముఖ్య బాధ్యుల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు మోత్కూరి రామచందర్ మార్గదర్శకాల మేరకు జరిగిన ఈ సమావేశంలో ఉత్సవాల నిర్వహణ, జిల్లా స్థాయి కార్యక్రమాలపై చర్చించారు. మే 5 నుండి 10 వరకు జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని సమావేశంలో తీర్మానించారు. జిల్లా కేంద్రంలో ఒకరోజు ప్రారంభ కార్యక్రమం ఉంటుంది. మానసిక ఆరోగ్యం జాగ్రత్తలు అనే అంశంపై ప్రజలకు అవగాహన కల్పించేలా సదస్సు ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుత కాలంలో మానసిక ఒత్తిడిని అధిగమించే మార్గాలపై నిపుణులు సూచనలు చేస్తారు. ఈ కార్యక్రమాలకు జిల్లాలోని సైకాలజిస్టులందరూ హాజరు కావాలని కోరారు.మే 9, 10 తేదీల్లో హైదరాబాద్లో జరిగే రాష్ట్ర స్థాయి దశాబ్ది ఉత్సవాలకు జిల్లా నుండి పెద్ద సంఖ్యలో ప్రతినిధులు తరలివెళ్లాలని నిర్ణయించారు. ఈ ఉత్సవాలను విజయవంతం చేసే బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర బాధ్యులు బి. నారాయణరావు, ముఖ్య సలహాదారులు గుండేటి యోగేశ్వర్, కస్తూరి పద్మ చరణ్, బాధ్యులు పప్పుల నాగరాజు, చిందం మొగిలి పాల్గొన్నారు.

# సమ్మర్ క్యాంప్ నిధులు విడుదల చేయాలి

## - ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్యకు గజిటెడ్ ప్రధానోపాధ్యాయుల వినతి

**కాగజ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:**

కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్యను హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర గజిటెడ్ ప్రధానోపాధ్యాయుల అసోసియేషన్ కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు పర్శ చంద్రశేఖర్ కలిసి సమ్మర్ క్యాంప్ నిధులు వెంటనే విడుదల చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం వేసవిలో ఆసిఫాబాద్ జిల్లాలో 50 పాఠశాలల్లో సమ్మర్ క్యాంపులను ప్రధానోపాధ్యాయులు సమర్థవంతంగా నిర్వహించినప్పటికీ, దాదాపు సంవత్సరం గడిచినా ఇప్పటివరకు సంబంధిత నిధులు మంజూరు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కమిషనర్, పాఠశాల విద్యా డైరెక్టర్, విద్యాశాఖ కార్యదర్శి దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి జిల్లా ప్రధానోపాధ్యాయులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా విద్యారంగానికి సంబంధించిన పలు సమస్యలను కూడా వినతిపత్రంలో ప్రస్తావించారు. తెలంగాణ విద్యాశాఖ నూతన సబార్డినేట్ సర్వీస్ రూల్స్ రూపొందించి గజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని, రెండు సంవత్సరాల కనీస సర్వీస్‌తో బదిలీలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి స్కూల్ కాంప్లెక్స్ పాఠశాలకు కంప్యూటర్ ఆపరేటర్‌ను నియమించాలని, అన్ని ఉన్నత పాఠశాలల్లో కంప్యూటర్ బోధకులు మరియు నైట్ వాచ్‌మెన్‌లను నియమించాలని డిమాండ్ చేశారు. అలాగే కాంట్రాక్ట్ పద్ధతిలో సమగ్ర శిక్ష తెలంగాణలో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది అయిన కేజీబీవీ, సీఆర్‌పీ, ఎంఐఎస్, సీసీఓలకు ఉద్యోగ భద్రత కల్పించి, వారికి మినిమం టైమ్ స్కేల్, మినిమం బేసిక్ పే అమలు చేయాలని కోరారు. వినతిపత్రంలో ప్రస్తావించిన సమస్యలను ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య సానుకూలంగా స్పందించి వాటిని విద్యాశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.



వినతిపత్రం అందజేస్తున్న అధ్యక్షుడు పర్శ చంద్రశేఖర్, సభ్యులు




## పారదర్శకంగా జనగణన పూర్తి చేయాలి

**బజార్‌హత్నూర్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:**

జాతీయ జనగణన ప్రక్రియను అత్యంత పారదర్శకంగా పూర్తి చేయాలని తహసిల్దార్ శ్యామ్ సుందర్ ఆదేశించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు మూడు రోజుల పాటు నిర్వహించిన మొదటి విడత శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిక్షణ పొందిన సిబ్బంది మే 11 నుంచి ప్రారంభమయ్యే జనగణన విధుల్లో బాధ్యతాయుతంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. అనంతరం క్షేత్రస్థాయిలో అవగాహన కోసం సిబ్బందితో కలిసి గ్రామంలో ప్రయోగాత్మకంగా జనాభా గణన నిర్వహించారు. శిక్షణలో నేర్చుకున్న విధివిధానాలను పాటిస్తూ వివరాలను పక్కాగా సేకరించాలని తహసిల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్లు ఎస్. చందన్ బాబు, నర్సింగ్, రెవెన్యూ అధికారులు నూర్సింగ్, మహేందర్, ప్రధానోపాధ్యాయులు జే. భూమన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## దిలావర్‌పూర్ మండలంలో అద్భుత ఫలితాలు

### - పాఠశాలల్లో 100 ఉత్తీర్ణత

**దిలావర్‌పూర్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:**

దిలావర్‌పూర్ మండలంలో ఒక్క పాఠశాల మినహాయించి మిగతా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ఈసారి 100 ఉత్తీర్ణత సాధించాయని మండల విద్యాధికారి సదానందం తెలిపారు. గుండంపల్లి, బన్సపల్లి ప్రభుత్వ పాఠశాలలు, కస్తూర్బా గాంధీ విద్యాలయం, ప్లేయర్ హై స్కూల్, లిటిల్ స్కాలర్ ప్రైవేట్ పాఠశాలలు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాయి. జడ్పీహెచ్ఎస్ దిలావర్‌పూర్‌కు చెందిన ఎం. సుమిత్ 564 మార్కులతో, ఆర్ కృష్ణ 550 మార్కులతో రాణించగా, బన్సపల్లి పాఠశాల విద్యార్థులు ఐశ్వర్య 517, షేక్ మొబిన్ 507 మార్కులు సాధించారు. గుండంపల్లి పాఠశాల నుంచి సంజన 510, బన్నీ 486 మార్కులు పొందారు. కేజీబీవీ పాఠశాల విద్యార్థులు వైష్ణవి 549, గంగోత్రి 542 మార్కులు సాధించారు. ప్రైవేట్ పాఠశాలలలో బి. భవాని 572 మార్కులతో మండల టాపర్‌గా నిలిచింది. విద్యార్థుల ప్రతిభపై మండల విద్యాధికారి సదానందం అభినందనలు తెలిపారు. అధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

## పదవ తరగతి ఫలితాలలో విద్యార్థుల ఉత్తమ ప్రతిభ

**సారంగాపూర్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:**

సారంగాపూర్ మండలంలో పదవ తరగతి ఫలితాల్లో 99 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాధికారి మహేందర్ తెలిపారు. మండలంలోని మొత్తం 14 ఉన్నత పాఠశాలల్లో 11 పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించగా, మూడు పాఠశాలలు 97 శాతం ఉత్తీర్ణత సాధించాయి. మొత్తం 466 మంది విద్యార్థులకు గాను 462 మంది ఉత్తీర్ణులయ్యారు. మండలంలో వివేకానంద పాఠశాలకు చెందిన ముస్కాన్ 573 మార్కులతో అగ్రస్థానంలో నిలవగా, కేజీబీవీ పాఠశాల విద్యార్థిని ఏ. రిషిక 565 మార్కులు, టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ జామ్ విద్యార్థిని ఏ. ఆకృతి 562 మార్కులు సాధించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చించోలి (ఎం) విద్యార్థి వినోద్ కుమార్ 543 మార్కులతో ప్రతిభ చాటారు. అత్యున్నత మార్కులు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు అభినందించారు.

## పదవ తరగతి ఫలితాల్లో జిల్లా ప్రథమ ర్యాంకు సాధించిన మేధా మోరల్ స్కూల్ విద్యార్థిని

**నిర్మల్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:**

బుధవారం వెలువడిన పదవ తరగతి ఫలితాల్లో నిర్మల్ జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. నిర్మల్‌లోని మేధా మోరల్ స్కూల్ విద్యార్థిని కొప్పెల అక్షయారెడ్డి 600 మార్కులకు గాను 590 మార్కులు సాధించి జిల్లా ప్రథమ ర్యాంకు కైవసం చేసుకుంది. పాక్పట్ల గ్రామానికి చెందిన రైతు కొప్పెల రాజశేఖర్ రెడ్డి కుమార్తె అక్షయారెడ్డి వ్యవసాయ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చి ఈ అరుదైన విజయాన్ని అందుకుంది. పాఠశాలలో అందిన నాణ్యమైన విద్య, ఉపాధ్యాయుల నిరంతర ప్రోత్సాహం, మార్గదర్శకత్వమే తన విజయానికి కారణమని విద్యార్థిని తెలిపింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ టీ. శారద, కరస్పాండెంట్ సిద్ధార్థ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. అక్షయారెడ్డి సాధించిన జిల్లా స్థాయి విజయం ఆమె పట్టుదలకు నిదర్శనమని, తమ విద్యార్థిని ఇంతటి ఘనత సాధించడం గర్వకారణమని వారు తెలిపారు. అక్షయారెడ్డిని పాక్పట్ల గ్రామస్తులు, ఉపాధ్యాయులు, యాజమాన్యం, శ్రేయోభిలాషులు అభినందించారు. భవిష్యత్తులో ఆమె మరిన్ని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు.

## ఎస్సీ కార్పొరేషన్ ఇంటర్వ్యూలు

**బెజ్జూర్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:**

బెజ్జూర్ మండలంలోఎస్సీ కార్పొరేషన్ 202526 ఆర్థిక సంవత్సరానికి ఆర్థిక సహాయాన్ని కోరుతూ 38 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఎలక్ట్రిక్ ఆటోలు, ఎలక్ట్రిక్ స్కూటర్లు, పాడి గేదెలు, సోలార్ పంపుసెట్ల కోసం దరఖాస్తులు వచ్చాయని, వారికి బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించగా 37 మంది ఇంటర్వ్యూలకు హాజరైనట్లు తెలిపారు. సత్య కిరణ్ తెలంగాణ గ్రామీణ బ్యాంక్, బెజ్జూర్. డాక్టర్. లక్ష్మీనారాయణ, పశువైద్యాధికారి బెజ్జూర్. ఎస్సీ కార్పొరేషన్ ప్రతినిధి ఐకెపి నుండి రంగయ్య సిసి ఐకేపీ. మూసా సోహెల్ జూనియర్ అసిస్టెంట్ పాల్గొన్నారు. అర్హులైన అందరికీ వారు దరఖాస్తు చేసుకున్న యూనిట్లు మంజూరు అవుతాయని అన్నారు. గతంలో కార్పొరేషన్ నుంచి లబ్ధి పొందని వారికి, సిబిల్ రిపోర్టు ఉన్నవారికి అన్ని పత్రాలు సక్రమంగా ఉన్నవారికి మండల కమిటీ ఎంపిక అయిన తర్వాత, మంజూరు కొరకు ఈడిఎస్సి కార్పొరేషన్ ఆసిఫాబాద్ వారికి పంపనున్నట్లు ఎంపీడీఓ బండారి ప్రవీణ్ కుమార్ తెలిపారు.

## నీటి కుంటలో బాలుడి మృతదేహం

### - చెడ్వాయిలో కలకలం

**పెంచికల్‌పేట్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త :**

మండలంలోని చెడ్వాయి గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. 13 ఏళ్ల బాలుడు అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. గ్రామంలోని రైతు వేదిక వెనుక ఉన్న నీటి కుంటలో బుధవారం బాలుడి మృతదేహం బయటపడింది. పోలీసుల వివరాల ప్రకారం అరెగూడ గ్రామానికి చెందిన దొబె మహేష్ ( 13 ) ఇటీవల కుటుంబసభ్యుల శుభకార్యానికి చెడ్వాయి గ్రామంలోని తన అమ్మమ్మ ఇంటికి వచ్చాడు. మంగళవారం సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన మహేష్ తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు రాత్రంతా పరిసర ప్రాంతాల్లో గాలింపు చేపట్టిన అతని జాడ కనిపించలేదు. బుధవారం ఉదయం గ్రామంలోని రైతు వేదిక సమీపంలోని నీటి కుంటలో బాలుడి మృతదేహం కనిపించడంతో స్థానికులు కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై అనిల్ కుమార్ తెలిపారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

## పదిలో కెరిమెరి విద్యార్థుల ప్రతిభ

**కెరమెరి ఏప్రిల్ 29 ప్రభాతవార్త:**



మండలంలో 99 ఉత్తీర్ణకుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలో పదో తరగతి ఫలితాల్లో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఇటీవల విడుదలైన ఎస్ఎస్సీ ఫలితాల్లో మండలంలోని 7 పాఠశాలలకు చెందిన మొత్తం 338 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 334 మంది ఉత్తీర్ణత సాధించి 99 శాతం ఫలితాన్ని నమోదు చేశారు. మోడీ కేజీబీవీ పాఠశాలలో ఎన్ మీనాక్షి 542 మార్కులు సాధించి మండల టాపర్ గా నిలిచారుఈ విజయానికి కారణమైన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులను మండల ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు అభినందించారు. మండల విద్యాధికారి ఆడే ప్రకాష్ మాట్లాడుతూ మండలంలో విద్యా ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని తెలిపారు. మండలంలోని గోయాగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గత సంవత్సరం 100 ఉత్తీర్ణత సాధించగా, ఏడాది సైతం 100 ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. అదేవిధంగా ఉత్తీర్ణత శాతం ప్రకారం జిల్లాలోనే కెరమెరి నిలిచింది.



## విద్యార్థినికి సన్మానం.. రూ.5వేలు నగదు ప్రోత్సాహకం

**తాండూర్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త :**

తాండూర్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థిని తేజస్వినిపదో తరగతి పరీక్షల్లో 560 మార్కులు సాధించిన సందర్భంగా బుధవారం సాయంత్రం సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థిని తేజస్వినికి మాజీ ఎంపీపీ సిరంగి శంకర్ 5000 రూపాయలు నగదును ప్రోత్సాహకంగా అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాసాడి తిరుపతి, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వధూవరులను ఆశీర్వదించిన భోస్లే మోహన్‌రావు పటేల్

**భైంసా, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:**



నిజామాబాద్ జిల్లా వర్ని మండల కేంద్రం, ముధోల్ నియోజకవర్గంలో నిర్వహించిన పలు వివాహ శుభకార్యాలకు ప్రజా ట్రస్ట్ చైర్మన్ భోస్లే మోహన్ రావు పటేల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన నూతన వధూవరులను ఆశీర్వదిస్తూ వారి దాంపత్య జీవితం ఆనందంగా, సుఖశాంతులతో నిండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో ఆయనతో పాటు సుభాష్ జాదవ్, మనోజ్ పాపిన్ వార్ పాల్గొని వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.